గాయపడిన కార్మికుడికి చెక్కు అందజేత



జీడిమెట్ల: పరిశ్రమలో గాయపడిన కార్మికునికి స్థానిక నాయకులు అండగా నిలిచి రూ.1.50 లక్షలు పరిశ్రమ యాజమాన్యం చేత ఇప్పించారు. జార్ఖండ్‌ రాష్ట్రానికి చెందిన దిగ్గమల్లు సుభాష్‌నగర్‌లో ఉంటూ ఓ పాలిమర్‌ పరిశ్రమలో మిషన్‌ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగురోజుల క్రితం దిగ్గుమల్లు పరిశ్రమలో యంత్రం వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తు చేతి వేలికి తీవ్రగాయమైంది. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు పోలే శ్రీకాంత్‌, భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌ చొరవ తీసుకుని కార్మికుడికి చికిత్స నిమిత్తం రూ.లక్ష అదే రోజు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఇప్పించారు. మంగళవారం పరిశ్రమ యాజమాన్యం చేత మరో రూ.1.50 లక్షలు ఇప్పించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సుచిత్ర నుంచి కొంపల్లికి వెళ్లే సర్వీస్‌ రోడ్డులోని పిస్తా హౌస్‌ సమీపంలో చెట్టు కింద ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు 100కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పేట్‌బషీరాబాద్‌ పోలీసులు అతడిని పరిశీలించగా.. అప్పటికే మృతి చెందాడు. మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, అతని వివరాలు తెలియలేదని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

కూకట్‌పల్లి: పార్టీ తరఫున ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్‌ అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ ఏడవ ఫేజ్‌లోని భాస్కెట్‌ బాల్‌ గ్రౌండ్‌లో మెడికవర్‌ హాస్పిటల్‌ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రంగ, నితీష్‌గౌడ్‌, ప్రవీణ్‌ అప్పారావు, అరవింద్‌ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో సంఘాలు భాగస్వాములవ్వాలి

బీఆర్‌ఎస్‌ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: ప్రజా ప్రతినిధులు, ప్రజలకు సంక్షేమ సంఘాలు వారధులుగా ఉండాలని, కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్‌ వైష్ణవి ఎన్‌క్లేవ్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్‌ నేతృత్వంలో ఎమ్మెల్యేను కలిశారు. నూతన కమిటీ సభ్యులను సన్మానించి ఎమ్మెల్యే మాట్లాడారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఎంపీఆర్‌ చంద్రశేఖర్‌, కోశాధికారి రాకేష్‌, ఉపాధ్యక్షులు సయ్యద్‌ హుస్సేన్‌, బి.కె.గౌడ్‌, సంయుక్త కార్యదర్శి నాగరాజు, ఎం.శ్రీనివాస్‌, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ ఎస్‌.కె.పాండే తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

జగద్గిరిగుట్ట డివిజన్‌ భూదేవిహిల్స్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ జగన్‌, డివిజన్‌ అధ్యక్షుడు రుద్ర అశోక్‌, శ్రీవేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్‌ వేణు యాదవ్‌, నాయకులు బాబు గౌడ్‌, విఠల్‌, శేఖర్‌, జైహింద్‌, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌, కార్పొరేటర్‌ జగన్‌

అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. భూదేవి హిల్స్‌లో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. ఆ అభివృద్ధే తనను మూడవ సారి ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారని అన్నారు.

సీసీ రోడ్డు పూర్తి చేయాలని వినతి

సుభాష్‌ నగర్‌ డివిజన్‌ సూరారం కాలనీ వాసులు ఎమ్మెల్యేను సీసీ రోడ్డు పనులను పూర్తిచేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన.. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కుమ్మరి చందు, భీమ్‌రాజ్‌, గిరి, మున్నా, మహేష్‌, రమేష్‌ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన వైష్ణవి ఎన్‌క్లేవ్‌ అసోసియేషన్‌ కార్యవర్గ సభ్యులు

రోడ్లపై గుంతలు.. ప్రయాణికులకు తిప్పలు



జీడిమెట్ల: జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి కొత్త రోడ్ల నిర్మాణం చేశారు. అయినా కొన్ని చోట్ల గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పేరుకుపోతున్న చెత్త!

రంగారెడ్డినగర్‌: ప్రధాన రోడ్లపై చెత్త డంపింగ్‌తో తీవ్ర దుర్గంధం వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. షాపూర్‌నగర్‌ మార్కెట్‌ సమీపంలో ప్రధాన రోడ్డును ఆనుకుని కొన్ని రోజులుగా చెత్తను డంప్‌ చేస్తున్నారు. సమీపంలోనే కూరగాయల మార్కెట్‌ ఉండటంతో కొనుగోలుదారులు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సమీప దుకాణదారులు వాపోతున్నారు. రోడ్డుపై చెత్త వ్యర్థాలను డంప్‌ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నారిని అప్పగించిన పోలీసులు

జీడిమెట్ల: ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయిన చిన్నారిని జీడిమెట్ల పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. షాపూర్‌నగర్‌ వివేకానందనగర్‌కు చెందిన చిన్నారి(17 నెలలు) ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు చిన్నారిని చేరదీసి అడ్రస్‌ కనుక్కుని తల్లికి అప్పగించారు. పోలీసులకు చిన్నారి తల్లి కృతజ్ఞతలు తెలిపింది.



నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

దుండిగల్‌: మేడ్చల్‌ జిల్లా టాస్క్‌ ఫోర్స్‌ టీమ్‌ ఆధ్వర్యంలో మంగళవారం గండిమైసమ్మ- దుండిగల్‌, కుత్బుల్లాపూర్‌, బాలానగర్‌ మండలాల్లోని వివిధ విత్తన కంపెనీలను తనిఖీ చేశారు. కొంపల్లిలోని నూజివీడు సీడ్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌, తెలంగాణ స్టేట్‌ సీడ్‌ డెవలప్మెంట్‌ కార్పొరేషన్‌ విత్తన కంపెనీలో తనిఖీలు నిర్వహించి స్టాక్‌ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ.. ప్రతి విత్తన కంపెనీ యాజమాన్యం నాణ్యమైన విత్తనం తయారు చేయాలని, స్టాక్‌ బోర్డులను మెయిన్‌టైన్‌ చేయాలని సూచించారు. ఎవరైనా కంపెనీ యాజమాన్యం అనుమతి లేని విత్తనాలు, నాణ్యతలేని విత్తనాలు సరఫరా చేస్తే విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన ధ్రువీకరణ అధికారి శివకుమార్‌, దుండిగల్‌ మండల వ్యవసాయ అధికారి యాదగిరి, బాలానగర్‌ మండల వ్యవసాయ అధికారి సాయి రమేష్‌ పాల్గొన్నారు.



కొంపల్లిలో నూజివీడు సీడ్స్‌లో స్టాక్‌ తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ తదితరులు

రేడియం స్టిక్కర్‌ లేక ప్రమాదాలు!

సుభాష్‌నగర్‌: దూలపల్లి ప్రధాన రోడ్డులో పలుచోట్ల యూటర్న్‌ వద్ద రేడియం స్టిక్కర్లు లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నాలుగు జాతీయ రహదారులను కలిపే ఈ రోడ్డు నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. దూలపల్లిలో నాలుగు చోట్ల యూటర్న్‌లు ఉన్నాయి. అక్కడ ప్రమాద సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో రాత్రి వేళలో వాహనదారులు గమనించక డివైడర్‌ని ఢీ కొట్టి గాయలపాలవుతున్నారు. ఇలా ఇప్పటికి పదుల సంఖ్యలలో ప్రమాదాలు జరిగినా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. తాజాగా సోమవారం రాత్రి బహదూర్‌పల్లి నుంచి కొంపల్లి వైపు వస్తున్న ఓ వాహనం డివైడర్‌ కనిపించకపోవడంతో ఢీ కొట్టింది దీంతో కాసేపు అక్కడ ట్రాఫిక్‌ జామైంది.



దూలపల్లి ఎన్టీఆర్‌ స్టాచ్‌ వద్ద ..

వ్యక్తి అదృశ్యం

సుభాష్‌నగర్‌: వ్యక్తి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దేవేందర్‌నగర్‌కు చెందిన కార్పెంటర్‌ పనులు నిర్వహించే వరప్రసాద్‌(36) సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా జాడ తెలియలేదు. దీంతో తండ్రి రామబ్రహ్మం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూరారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో..

సుభాష్‌నగర్‌: ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన వెంకటేశ్వరరావు(35), హేమవెంకటలక్ష్మిలు భార్యాభర్తలు. గత నెల 30న ఉదయం 9 గంటలకు భార్య డ్యూటీకి వెళ్లగా.. వెంకటేశ్వరరావు మేస్త్రీ పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. భోజన అనంతరం బ్యాగ్‌లో రెండు జతల బట్టలు, మేస్త్రీ పనికి సంబంధించిన సామాను పెట్టుకుని వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన భార్య అతని ఫోన్‌కు చేయగా స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా వెంకటేశ్వరరావు ఆచూకీ తెలియలేదు. భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వరప్రసాద్‌(ఫైల్‌)



వెంకటేశ్వరరావు(ఫైల్‌)